బోట్‌హౌస్

మా ఆవిడ పిల్లలను తీసుకొని పుట్టింటికెళ్ళింది. మళ్ళీ పది రోజులలో తిరిగి వస్తానన్నది. పది రోజుల భాగ్యనికి హెూటల్లో చేరటం ఎందుకని నేనే చెయ్యి కాల్చుకుంటున్నాను.

మా ఆవిడ వెళ్ళిన మరునాడే మా మేనత్త వచ్చింది. చాలా రోజులైన తరువాత మా అత్తను చూచాననే కాకుండా, ఈ పది రోజులూ, చెయ్యి కాల్చుకోకుండా పోతుంది గదా అని నేను ఎంతో సంతోషించాను.

కాని వచ్చిన రోజు సాయంత్రం ఆవిడ అన్నది. ప్రొద్దున బండికి నేను వెళ్ళుతారా నాయినా అని "ఏమమ్మా అప్పుడే వెళ్ళటం ఏమిటి? ఏం రావటం? ఏం పోవటం? మీ కూతురూ పిల్లలూ రెండు మూడు రోజులలో వస్తారు. ఉండి పిల్లలను చూచిపో" అన్నాను.

"కాదులే నాయినా తొందరపని ఉంది. నేను రావటమే అసలు ఓ అర్జంటు పని మీద వచ్చాను. అసలు నేను కదలేదాన్నా?

ముసలాయనకు వంట్లో ఏమీ బాగుండలేదు. ఆయనకు పథ్యం పానం నేను పెట్టాలిసిందే గాని కోడలు కేమీ తెలియదు. అదీగాక దానికి నిండు నీళ్ళాడే పొద్దులూ! ఇవ్వాళో రేపో అనుకుంటున్నాము. నన్ను బలవంత పెట్టక వెళ్ళనియ్యి." అన్నది.

అల్లాంటప్పుడు నీవు ఇల్లు కదలవలసిన అవసరమేమి వచ్చిందమ్మా అని అడిగాను. ఏం జేసేది నాయినా? ఆ నాంచారమ్మ, ఒక్క తీరాన కాళ్ళూ గడ్డం పట్టుకొని బ్రతిమిలాడి పంపింది.

"ఎందుకూ?"

"అదో గొడవ ఉందిలే! ఈ వూళ్ళో ఓ మంచి భూతవైద్యుడున్నాడు. ఆయన్ను తీసికెళ్ళటానికే వచ్చాను. రేపు ప్రొద్దుటి బండికే ఆయనా వస్తాడు. ఇద్దరం కలిసే వెడతాము"

"భూతవైద్యుడూ? అయితే ఏదో గాలి సోకిందా ఏమిటి ఆమెకూ?"

"అవునురా నాయినా, మన ఇంటి ప్రక్కనేగా వాళ్ళ ఇల్లు! ఆ ఇంట్లో ఒక దయ్యం ప్రవేశించింది!"

దయ్యాలయందు నాకు అట్టే నమ్మకం లేదు. అందుకని హేళనగా మాట్లాడాను. "దయ్యం! దయ్యం ఎట్లా ప్రవేశించిందమ్మా" అని.

"ఎట్లాగో , దయ్యాలు వచ్చే దారులేవో మనం చెప్పగల్గుదుమా! ఎట్లాగో ప్రవేశించింది" అన్నది ఆవిడ.

"ఎవ్వరూ చూడలేదు అన్నమాట!"

"ఎట్లా చూస్తారురా? అయినా చూస్తుండగా వస్తుందా దయ్యం?"

"అయితే దొంగదయ్యం అన్న మాట" అన్నాను నేను.

మా అత్తయ్య ఈ పిచ్చి మాటలు విని విసుక్కొని ఊరుకొన్నది. కాని నాకు ఆ దయ్యం ఎల్లాంటిదో ఏమిటో తెలుసుకోవాలెనని ఉండటం వల్ల "ప్రవేశించి ఏం జేసేదమ్మా" అని అడిగాను.

"ఎందుకూ చెప్పటం? నీవు అంతా వట్టిదే అంటావు ఈ ఇంగ్లీషు చదువుకొన్న వాళ్ళందరికీ ఇదొకటి! దయ్యాలంటే నమ్మకం లేదు"

"నమ్మకం లేకపోవటానికి కారణం ఏమిటంట దయ్యాన్ని నేను చూశాను. అని చెప్పగలవాళ్ళు నాకెవ్వరూ ఇంతవరకు కనపడలేదు"

"అయితే అబ్బాయీ కనపడటానికి వీలు లేని వస్తువు ఎల్లాగ కనపడుతుందిరా? నీకు గాలి కనపడుతుందా దయ్యమూ గాలే, కాబట్టి అది మన కళ్ళకు కనపడదు?"

"గాలి మన శరీరానికి చల్లగానూ, వెచ్చగానూ తాకటము మనం తెలుసుకోటం లేదుటమ్మా?"

"ఇంకేం. అల్లాగే దయ్యం. అది చేసే పనుల వల్ల దాని సంగతి తెలుస్తుంది. "

మా అత్తయ్య చెప్పిన మాట నిజమే అనిపించింది.

కార్యాన్ని బట్టి కారణం ఊహించడం సరియైన పద్ధతే. అందుకని నేను

మళ్ళా అడిగాను.

"ఏం జేస్తుంది అత్తయ్యా కాస్త నాకు చెప్పు వింటానూ" అని.

"ఏం జెయ్యటమేమిటి? నానా అల్లరీ చేస్తుంది!"

"అరుస్తుందా!"

"ఇంకా అది కూడా ఉంటే ఈ పాటికి అందరి ప్రాణాలు పోయేవే!"

"మరి ఏమిటి అది చేసే అల్లరి?"

"చెప్పితే నమ్మవు గాని నేను కళ్ళారా చూశానురా?"

"ఏమిటమ్మా అది?"

"ఏమిటా? ఒక రోజున నేనూ నాంచారమ్మా ఇల్లాగే కూర్చుని మాట్లాడుకొంటున్నాము. ఏదో పిచ్చపాటీనూ, ఇట్లా మాట్లాడుకొంటూనే ఉన్నాము. ఇంతలో ఆ దయ్యం వచ్చి నాంచారి వీపు పైని ఫెడీమని చరిచింది!"

"అంతగట్టిగా కొట్టడం ఏం బాగుండలేదు. నాంచారమ్మ చక్కనిది కూడా, వీపు ముద్దెట్టుకోవాలిసింది"

"ఒరేయ్ నీదంతా వేళాకోళం! అందుకనే నీకు చెప్పనన్నాను. నేను కళ్లార చూశాను గదా. మాట్లాడుతూ మాట్లాడుతూ ఆమె అమ్మయ్యో అని కేకపెట్టి పెళ్ళున విరుచుక పడిపోవటం!"

"అదేదైనా జబ్బు అయివుంటుందమ్మా అత్తా?"

"జబ్బు రావలసిందే! నేను బాగా ఎరుగుదును. ఏం జబ్బూ లేదు. దుక్కలాగుంది. తింటుంది తిరుగుతుంది. నిద్ర పోతుంది. జబ్బు మనిషి అయితే కనపడదురా, ఎండుకు పోవటమూ, ఆర్చుకు పోవటమూనూ! ఏమీ లేందే! నిక్షేపం లాగుంది. ఆ దయ్యం కొట్టినపుడు మాత్రం విరుచుకు పడుతుంది"

" ఆ దయ్యం వల్ల అంతకంటే ఇంకేమి బాధలేదా?"

"సరే ! అదొకటేనా? అర్ధరాత్రి వేళ అటకపై నున్న చెంబులు తప్పాలలూ ఊపి గలగల్లాడిస్తుంది.

"ఎందుకో"

"నా బొంద ఎందుకేటి! ఇంట్లో వాళ్ళని హడలగొట్టి చంపటానికి!"

"పంది కొక్కులూ అల్లాటివి ఏమైనా చెంబు తప్పాలలను కదిలిస్తూ ఉన్నాయేమో ?"

"పందికొక్కులు కావాలసిందే! పాత్ర సామగ్రిని ఎత్తిపడేసినట్లు శబ్దం అవుతుంటే! అంతమాత్రం తెలియదూ పోనీ అది అట్లా ఉంచు. దీనికేమంటావు? నిండు నీళ్ళ గంగాళం, మేము చూస్తూ ఉండగానే దభీలున పడిపోయింది? మరి ఏమిటి చెప్పు ఇది? ఇల్లాంటివే అన్నీ అల్లరి చేష్టలు చేస్తున్నది ఆ దయ్యం"

"అల్లరి దయ్యం అన్న మాట అత్తయ్యా అది వర్థి అల్లరి దయ్యం" అని నేను ఆ దయ్యపు స్వభావాన్ని గురించి ఆలోచించగా తేలిన సారాంశం చెప్పాను.

ఆవిడ ఏమీ సంతోషించక మళ్ళీ ఇల్లాగ అన్నది. "అది ఆ ఇంట్లో చేసే అల్లరి ఇంతా అంతా కాదు. దీని దుంపతెగ ఎక్కడ నుంచి తెస్తుందో రోజూ ఇటుకముక్కలు తెచ్చి ఇంటి నిండా పడేస్తుందిరా!"

ఇదేదో తమాషే అనిపించింది.

"ఇటుక ముక్కలు తేవటం ఏమిటమ్మా?" అన్నాను.

"ఇటుకలురా. మనం గోడ కట్టుకొనే ఇటుకలు చూశావూ అవి!! తెల్లవారేటప్పటికి ఒక కుప్ప తయారూ అవి తీసి పారేస్తే, మరో మూల తయారూ!! ఇల్లాగ నానా గోలానూ!"

అన్నది ఆవిడ నిద్ర కళ్ళతో.

"ఇంటి నిండా ఇటుకముక్కలు పడేస్తూ ఉంటే చికాగ్గానే ఉంటుంది. మరి ఇప్పుడేం జేస్తున్నారూ?"

"ఏం జేస్తున్నారూ, దాన్ని వదిలించుకోవాలని సకల ప్రయత్నాలూ చేస్తున్నారు. ఈ వూళ్లో ఓ గొప్ప భూతవైద్యుడు ఉంటె ఆయన్ను పిలుచుకు వెడదామని వచ్చాను"

"భూతవైద్యుడు వల్ల అవుతుందంటావా?" అని అడిగాను.

"ఆ భూతవైద్యుడు మంత్రాలు చదివి ఆ దయ్యాన్ని అక్కడ నుంచి తోలేయగలడు." అని చెపుతూనే ఉంది. ఎప్పుడు నిద్రపోయిందో నిద్రపోయింది ఆమె. ఆ తెల్లవారుఝామునకే ఆమె రైలుకు వెళ్ళిపోయింది.

2

నాకు మటుకు ఆ రాత్రి నిద్రపట్టలేదు. ఒకటే ఆలోచన దయ్యాలను గురించి. ఈ మధ్య కొన్ని ఇంగ్లీషు పుస్తకాలు చదివాను. కానొండైల్ కార్‌పెన్‌టర్ మొదలైన వారు దయ్యాలు ఉన్నవి అని వ్రాసిన మాటలు జ్ఞాపకం వచ్చినై. మా అత్తయ్య తాను కళ్ళార చూచిన విషయాన్ని నేను కాదని ఎలాగ త్రోసిపుచ్చేదీ? ఆలోచించి ఆలోచించి చివరకు, ఒక విధంగా దయ్యాలు ఉన్నవి అనే నిశ్చయానికే వచ్చాను.

ఆ తరువాత ఈ నాంచారమ్మ గారి ఇంట్లో ప్రవేశించిన దయ్యాన్ని గురించి ఆలోచించాను. అది ఇటుకలు తెచ్చి పడేస్తుంది అన్న విషయమే నన్ను ఎక్కువగా ఆకర్షించింది. ఇటుకలు ఇప్పుడు చాలా ప్రియంగా ఉన్నవి. వెయ్యి ఇరవై రూపాయలకు తక్కువ లేదు. కాబట్టి అల్లాంటి దయ్యం ఒకటి మన ఇంట్లోఉండటం చాలా అవసరమని తోచింది.

ఎట్లాగూ దొడ్లో ఒక చిన్న ఔట్‌హౌస్ వేయిద్దామని చాలా రోజుల నుంచీ, అనుకుంటూనే ఉన్నాను. ఆ దయ్యం పుణ్యమా అంటూ రోజుకో నాలుగు వందల ఇటుకలు తయారు జేసి ఇచ్చిందా మనకు ఏ ఇబ్బందీ ఉండదు.

నాకు మహాకావలిస్తే ఇరవై వేల ఇటుకలు కావాలె. నెలా పదిహేను రోజుల్లో తయారుజేసి ఇస్తుంది. దాని తరువాత అది ఇచ్చే ఇటుకలన్నీ పోగు జేసుకొని అమ్ముకోవచ్చు. చాలా లాభకరమైన పని. ఆ దయ్యాన్ని మా ఇంటికి తీసుకురావాలె. ఈ ఉపాయం నాకు తోచినందుకు నాకు చాలా సంతోషం గలిగింది.

అయితే ఆ దయ్యం మన ఇంటకి వచ్చేటట్లు చెయ్యటం ఎల్లాగు? ఆ భూతవైద్యుడినే అడిగితే ఆ దయ్యాన్ని తీసుకొచ్చి మా ఇంట్లో వదలివేయమని? వెళ్ళగొట్టడానికి చేతనైన వాడు తీసుకురాలేక పోతాడా! కానీ ఒకరితో ఈ విషయం చెప్పటానికి నాకు మనస్కరించలేదు.

కాని ఆ దయ్యం వల్ల నాకు చాలా లాభం కలుగబోతున్నది కాబట్టి ఎల్లాగైనా దాన్ని రాబట్టటం మటుకు అవసరమని తోచింది.

అందుకని నేనే స్వయంగా ప్రార్థించాను.

"నాంచారమ్మ గారింట్లో ఉంటున్నటువంటి ఓ దయ్యమా నిన్ను అక్కడ నుంచి వెళ్ళగొడితే నీవేమీ విచారపడవద్దు. అంత వద్దు అంటూ వుంటే వాళ్ళ ఇంట్లోనే ఉండటం నీకేం ఖర్మం? నీవు యకాయకీని మా యింటికి వచ్చేసెయ్యి" అని మనఃపూర్వకంగా ప్రార్థించాను ఆ నిశరాత్రి వేళ ఒంటరిగా మంచం మీద కూర్చుని.

నా ప్రార్థన అంగీకరించి ఆ దయ్యం మాయింటికి వస్తుందా అని సందేహం కలిగింది. ఎందుకు రాకూడదు వస్తే రావచ్చు. వస్తే అదృష్టవంతుడ్నే. ఇటుకలు తెచ్చి పెట్టగల దయ్యం బంగారం తెమ్మన్నా తేగలదేమో!

అల్లాఉద్దీన్ కథ జ్ఞాపకం వచ్చింది. అది ఒక తమాషా అయిన కథ అనే యింత వరకూ అనుకొన్నాను గాని యిప్పుడు అది నిజమైన సంగతేనని తోచింది. ఇటుకరాళ్లు తెచ్చి పోయగల దయ్యం ఉన్నపుడు, బంగారం తేగల దయ్యం ఎందుకు వుండకూడదూ? ఈ దయ్యానికే బంగారం తేగల శక్తి కూడా తప్పకుండా ఉండి ఉంటుంది. నేను నిజంగా అదృష్టవంతుడ్ని అనుకొన్నాను. నా భార్యకు ఓ గొలుసు చేయించాలన్న విషయంకూడా ఆ సమయానికే జ్ఞాపకం వచ్చింది.

బంగారమే తేవాలె గాని రోజుకు రెండు తులాలు తెచ్చినా చాలు. కోలార్ జిల్లాలో గనులు త్రవ్వి బంగారం వేస్తున్నారు. అక్కడ నుంచి తెచ్చి పెట్టు అని చెబుదామనుకొన్నాను కూడా.

అది బంగారం తెచ్చి ఇయ్యలేదేమోనని నాకేమీ సందేహం కలుగలేదు. తెచ్చి యిస్తుందనే నమ్మకం కలిగింది.

కాని ఈ సంగతి ప్రభుత్వం ఎారికి తెలిస్తే వారు నాపైని పెద్ద పన్ను వేస్తారేమోనని భయం కలిగింది. ఈ ఆలోచన వచ్చేసరికి గుండె గుభేలుమంది. ఏ మాత్రం డబ్బు ఉన్నదని తెలిసినా గవర్నమెంటు వారు భరింపరాని పన్ను వేస్తున్నారు. రాజాధిరాజులే గడగడవణికి పోతున్నారు. నేను ఇవ్వలేనంత పన్ను వేస్తే నా గతి ఏం కావాలె!

ఈ దయ్యం బంగారం తేవటం మానేసినా పన్ను మటుకు వదలరు. అదీ కాక దయ్యం ఒకటి మా ఇంట్లో బంగారం చేస్తున్నదని ఆచూకీ దొరికినా ప్రభుత్వం వారు వెంటనే ఆ దయ్యాన్నే ఆహ్వానించి తీసుకెడతారేమో! కాబట్టి రెండో కంటి వాడికి తెలియకుండా చేస్తున్నట్లు కూడా ఎవ్వరికీ తెలియనీయకూడదని నిశ్చయించుకొన్నాను.

ఇంతకూ ఆ దయ్యం మా ఇంటికి వస్తేగిస్తే ఇదంతా దేనికైనా భగవంతుడి దయ కావాలె. ఈ మాట తోచిన తరువాత నా యిష్టదైవమైన మంగళగిరి నరసింహస్వామికి దణ్ణం పెట్టుకొన్నాను.

"స్వామీ ఆ విచిత్రమైన దయ్యాన్ని మా ఇంటికి పంపించు. దాన్ని ఏ విధమైన పిచ్చి చేష్టలు చేయకుండా కావలసిందేదో ఇచ్చే బుద్ధిగల దాన్నిగా చెయ్యి. ప్రభూ, ఆ దయ్యం మాకు బంగారం తెచ్చి ఇచ్చే ఏర్పాటు కూడా చెయ్యి వీలైతే" అని ప్రార్థించాను.

వీలైతే అని నొక్కి అన్నాను. ఎందుచేతనూ అంటే వీలు అవుతుందో కాదో! ముందుగానే నాకు అది కావాలె ఇది కావాలె అని గట్టిగా అడిగితే ఆ దయ్యం కాస్తా బెదిరి పారిపోవచ్చు.

నేనేమన్నా గొంతెమ్మ కోరికలు కోరుకొంటున్నానా అని నన్ను నేనే ప్రశ్నించుకొన్నాను. బంగారం ఎక్కడి నుంచి తెచ్చి యిస్తుంది. ఈ రోజులలో ఎక్కడి బంగారం యుద్ధంలో హరించుకుపోతూ ఉంటే!

పోనీ బంగారం కాకపోతే వెండి చాలు. అదీ దొరక్కపోతే ఇనుమైనా సరే. ఇనుము మటుకు ఏమన్నా తక్కువ ధరలో ఉందా? మేకులు మటుకు, మేకులు ఎంత ప్రియమైనవి! కానీకి గుప్పెడు ఇచ్చేవాళ్ళు. ఇప్పుడు కానీకి ఒక్కటైనా ఇయ్యటం లేదు. అని యిల్లా సరిపెట్టుకుంటూ వచ్చి చివరకు కట్టెపుల్లలు తెచ్చి పెట్టినా చాలుననుకొన్నాను. ఈ రోజుల్లో అడితీల వద్ద చేరిన గుంపులలో జొరబడి తోసుకొని నానా అవస్థా పడ్డా మూడు పుల్లలు దొరకటం లేదు. ఏదో ఇంతకూ అది రావాలె గాని ఏదో విధంగా సాయపడకపోతుందా అని అనుకొన్నాను.

ఎందుకు రాదూ? ఆ దయ్యాన్ని ఆహ్వానించాను. భగవంతుడ్ని కూడా ప్రార్థించాను వచ్చేటట్లు చేయమని!

ఇంకా ఏమి చేయాలె? భగవంతుడు ఆజ్ఞ యిస్తే వచ్చి తీరుతుంది. కాని ఆ భగవంతుడు. ఆ పానకాలరాయుడు, ఆజ్ఞ యిస్తాడా?

ఇల్లా అనుకుంటూ ఉండగానే జ్ఞాపకం వచ్చింది అరెరే పానకాలరాయుడికి ఎందుకు మొక్కుకున్నానా అని!

ఎందుచేతనూ అంటే పానకాలరాయుడు సగభాగం చెవులు మెలేసి లాక్కునే స్వభావం గలవాడు. చాలా పొరపాటు అయిపోయింది. తీరా మొక్కుకొన్నాను. ఇప్పుడు యింకో దైవానికి మొక్కు బదిలీ చేస్తే పానకాలరాయుడికి తప్పకుండా కోపం వస్తుంది.

"నాకు సగం యివ్వాలిసి వస్తుందని వీడు యింకో దేవుడ్ని ఆశ్రయిస్తాడా? వీడి పని పట్టిస్తానుండు" అని ఆయన అనుకొంటే అనుకోవచ్చు. ఏమన్నానో అన్నాను.

పానకాలరాయుడు మీదే భారం వేద్దామని నిశ్చయించుకొన్నాను. అనుకోరాని మాట అనుకొని స్వామి ఎడల అపరాధం చేసినందుకు చెంపలు వాయించుకొన్నాను.

ఓ విధంగా మనసుకు సంతోషం కలిగింది. ఆ దయ్యం బంగారమే యిచ్చే పక్షంలో సగం దేముడికిచ్చినా మరేమీ బెంగ లేదు. ఆ మిగిలిన సగం చాలు నా దరిద్రం తీర్చటానికి.

అయితే బంగారం కాక ఆ దయ్యం కట్టెలు తెచ్చి పడేసే పక్షంలో నాకు కాస్త యిబ్బందే. ఈ రేషనింగు రోజులలో దానికి మటుకు రెండు మూడు మణుగుల కంటే ఎక్కువ యిస్తారా? అందులో సగం దేముడికిస్తే నాకు మిగిలేదేమిటి? యిల్లాంటి ఆలోచన వల్ల మనస్సుకు కాస్త కష్టం కలిగింది కాని, యింతకూ ఆ దయ్యం వచ్చిన తరువాత సంగతి గదా చూద్దాములే అని నాకు నేనే చెప్పుకొని సంతోషించి, ఊరుకొన్నాను.

3

మరునాటి రాత్రి మళ్ళీ అవే ఆలోచనలు. ఆ రాత్రికి దయ్యం మా యింటికి రావాలె అసలు రావటం అంటూ ఉంటే ఆ రోజు రాత్రే దానికి అక్కడ ఉద్వాసన చెపుతారు. ఇహ అక్కడ ఎందుకుంటుంది? యకాయకీని ఆ రాత్రే మా యింటికి రావాలె.

అయితే దాని కోసం తలుపులు తెరిచి ఉంచాలా వద్దా అన్న సందేహం

వచ్చింది. అది తీరా వచ్చేసరికి తలుపులు వేసి ఉంటే ఏమనుకొంటుంది? నేను యింత దాన్ని వస్తే వీడు తలుపులు వేసి ఉంచుతాడా! యిదేనా ఆహ్వానం? ఇదేనా మర్యాద! ఛీ వీడి గడప తొక్కకూడదు అని వెళ్ళిపోతుందేమో అని భయం వేసింది.

అల్లా అని తీసి ఉంచుదామా అంటే ఒక యిబ్బంది ఉంది. ఊరి బయట ఇల్లు మాది. దయ్యం రావటమూ మాకు బంగారం చేసి ఇవ్వటమూ, ఎల్లా ఉన్నా ముందు యింట్లో ఉన్నది కాస్తా ఊడ్చుకు పోతుంది!

ఏం చేయాలిసింది నాకు తోచలేదు. చాలా చికాకేసింది. ఏమిటీ వెధవ పీకులాటలు ఈ ఆలోచనలే వదిలేద్దామా అన్నంత విసుగేసింది. కాని ఇంతలో, అబ్బాయీ, ఈ మాత్రం కష్టపడకపోతే నీవు ధనవంతుడవు ఎల్లాగ అవుతావు? కాబట్టి శ్రమ పడి ఆలోచించు, అని ఎవరో చెప్పినట్లు అయింది.

ఆ సమయానికే ఒక చక్కని ఆలోచన గబుక్కున తట్టింది. తలుపు తీసి ఉంచనక్కరలేదు. కిటికీలో నుంచి కూడా దయ్యం రావటానికి వీలుందీ అని. దయ్యాలు సూక్ష్మజీవులు కాబట్టి, కిటికీ చువ్వలూ అవీ, వాటికేమీ అడ్డంగాదు సరే అనుకొని కిటికీ తలుపులు తీసి పెట్టి పడుకొన్నాను.

కాని నిద్రపట్టలేదు. ఓ పెద్ద ఆలోచన నన్ను చాలా బాధించింది. అసలు దయ్యాన్ని ఇంట్లో ప్రవేశపెట్టటం మంచి పనా అని. పరిచయం లేని మనిషినే రానియ్యమే మన యింట్లోకి వాడు ఎట్లాంటి వాడో అన్న భయంతో! అల్లాంటప్పుడు ముక్కూ మొహం తెలియని దయ్యాన్ని యింట్లోకి తీసుకొచ్చుకోటం అంత తెలివైన పని కాదేమో అనుకొన్నాను. అదీకాక ఆ దయ్యం ఎవరో! ఎవరైనా మన స్నేహితుడి దయ్యం అయితే, యింత ఆలోచన ఉండేది కాదు. యిది బొత్తిగా కొత్త దయ్యమాయె!

ఏమీ పాలుబోక ఊహు ఆలోచిస్తూ పడుకొన్నాను. భయం వేసింది. యింతలో దూరాన ఎక్కడో జట్కా నడుస్తూ ఉన్నట్లు శబ్దం కూడా వినిపించింది. యింకేం అదే వస్తున్నది అనుకొన్నాను.

చాకలి దయ్యాలు చేరిన చోట పల్లకీ మోత వినపడుతుందనీ, బ్రాహ్మణ దయ్యాలు చేరిన చోట వేదాధ్యయనం జరుగుతూ ఉంటుందనీ, మా మామగారు

చెబుతూ ఉండే వారు. ఈ దయ్యం పూర్వాశ్రమంలో జట్కా ఎక్కి తిరుగుతూ ఉండేదై ఉండవచ్చు. యింతలో జట్కా చక్రాలు రోడ్డుపై దొర్లుతున్న శబ్దం మరీ మరీ దగ్గరగా వినపడటం సాగింది. ఆ శబ్దం మరీ దగ్గరకు వస్తున్నట్లు తోచిన కొద్దీ నాకు గుండెల్లో దడ ఎక్కువైంది.

ఇంకాసేపట్లో ఆ జట్కా మా యింటి ముందు ఆగటం, ఆ దయ్యం కిటికీ గుండా యింట్లోకి ప్రవేశించటం జరగబోతున్నదీ అని అనుకొనేసరికి ఎక్కడ లేని భయమూ పట్టుకొన్నది. అది నాకు ఉపకారం చేసేదే, అనుకోండి, ఎట్లాగైనా అది దయ్యం కాని మనిషి కాదు! దాన్ని యింట్లో ప్రవేశపెట్టటం విషయంలో ససేమిరా మనస్సు ఒప్పుకోలేదు.

ఎట్లాగ భగవంతుడా అని ఆలోచనలోకి దిగాను. చటుక్కున మెరుపులాగ ఒక ఊహ నా మనస్సుకు తట్టింది.

వెంటనే లేచి ఒక కాయితం కలం తీసుకొన్నాను. దానిపైన వ్రాశాను. "మహాశయా మీరు ఎవరో నాకు తెలియదు. మీ సుగుణ సంపత్తిని గూర్చి విని మిమ్ములను ఆహ్వానించాను. మీకు స్వాగతము. ముఖ్యంగా మీ వలన సాయం పొందాలనే నా ఆశయము. మీరు ఏదో ఒక విలువ గల వస్తువు తెచ్చి మా యింట్లో పడేస్తూ ఉండండి మీకు తోచినది. వీలైతే బంగారం. ఆ విషయం మీ అనుగ్రహానికి వదిలేశాను. మీరు చేసిన సహాయానికి నేను ఎప్పుడూ కృతజ్ఞత కలిగి ఉంటాను. బైట వరండాలో వేసియున్న పడక కుర్చీలో తాము శయనించ వచ్చును"

అని ముభావంగా వ్రాసి దానిని మా గేటు తలుపు సందులో పెట్టాను. ఆ తరువాత కిటికీ తలుపులన్నీ మూసి నిద్రపోవాలని పడుకొన్నాను.

నిద్ర పట్టలేదు. ఎవరో వీధిలో నడుస్తున్నట్లే శబ్దం అయింది. ఎవరో వస్తున్న చప్పుడు స్పష్టంగా వినవచ్చింది.

ఆ శబ్దం అంతకంతకు దగ్గరగా వినవచ్చింది. గేటు దగ్గర ఎవరో మనిషి నిలబడి ఉండాలె! లేకపోతే అంత స్పష్టంగా ఆ శబ్దం వినపడదు. యింకెందుకు! ఎవరో గేటు తీస్తున్నట్లు కూడా తెలుస్తూనే ఉంది!

"దారినిపోయే తద్దినాన్ని నెత్తిన ఎక్కించుకోటం అంటే యిదేరా! బంగారం చేసిపెడితే మటుకు దయ్యాన్ని యింట్లో చేరనిస్తారా! వెర్రినాగన్నా ఎంత పని చేశావు! ఎవరన్నా వింటే నవ్వుతారు" అని ఎవరో పెద్ద కేకలు పెట్టినట్లు తోచింది.

ఛీ లేచి పోయి, దాని కాళ్ళ మీద పడి యిటుక రాళ్లూ వద్దూ, యినపమేకులూ వద్దు తల్లీ. నీ దారిని నీవు వెళ్ళు అని అడిగితే?

అల్లా అయితే ఎందుకు పిలిచావు నన్ను? అంటుంది అది. అంటే బుద్ధి తక్కువై పిలిచాను. యిదిగో చెంపలు వేసుకొంటున్నాను. ఇక ఎప్పుడూ యిల్లాంటి పిచ్చి పని చేయను. ఈ తభాకు క్షమించు. ఓ శాకినీ, ఢాకినీ, అని ప్రార్థన చేద్దామని అనిపించింది.

అప్పటికీ పోకపోతేనో! పోకపోతే నరసింహస్వామిని ప్రార్థన చేస్తినా, అది తప్పక పారిపోతుంది. నరసింహస్వామి పేరు చెప్పినా, ఆంజనేయస్వామి పేరు చెప్పినా దయ్యాలు పారిపోతయ్యి. ఆ విషయంలో సందేహం ఏమీ లేదు నాకు.

అయితే అల్లాగ చేస్తే, ఇందాకటి నుండి నేను అనుకున్నదంతా హుష్ కాకీ అయిపోతుంది. రానున్న సంపదను వదులుకోటం అవుతుంది. హస్తగతమైన అమృతపూర్ణ కలశాన్ని బోరగించినట్లు అవుతుంది. నిన్ను, నిన్ను, అని వలచి వచ్చిన సకల ప్రాభవ సమలంకృతమైన లక్ష్మీదేవిని గృహ కవాటము నుంచి తరిమివేసినట్లు అవుతుంది. చక్రచధారాభ కఠోర దంష్ట్రా భయంకరాట్టహాస ముద్రిత వికృతరూపమైన దరిద్ర దేవతను రా రమ్మని ఆహ్వానించినట్లు అవుతుంది.

కాబట్టి ధైర్యాన్ని చిక్కబట్టి, నిలవదొక్కుకొని ఆ దయ్యం సంగతి ఏమిటో ఏం జేస్తుందో, ఇటుకలే ఇస్తుందో, బంగారమే ఇస్తుందో కనుక్కోవాలిగాని, పిరికి పందనై, భీరువునై, వెంగిలినై, వెర్రినై, వెధవనై, మందమతినై, గాభరాపడి, గబ్బేలు పడి ఇల్లాగ తెలివితక్కువ దద్దమ్మగా ప్రవర్తించరాదు. చూద్దాం! మరేమి ప్రమాదం లేదు.

దయ్యం సంగతి చూద్దాం. దాని వలన మరీ చికాకుగా ఉంటే అప్పుడే ఏదో ఉపాయం ఆలోచించవచ్చు. అని నాకు నేను బాగా ధైర్యం చెప్పుకొన్నాను.

ఈ నిశ్చయానికి వచ్చిన తరువాత మనస్సుకు శాంతి గలిగి నిద్ర పట్టింది.

మంచి స్వప్నం వచ్చింది. కలలో కొన్ని విషయాలు చూస్తే శుభం, మరి కొన్నిటిని చూస్తే అశుభం అని పెద్దలు అంటారు. నేను ఆ రోజున కలలో చూచినవన్నీ శుభప్రదమైనవే.

నిద్ర మెళకువ వచ్చేసరికి తెల్లవారుతూ ఉంది. మంచం మీది నుంచి, గభాలున లేచి వీధిలోకి పరుగెత్తాను దయ్యం ఆ రాత్రి వచ్చి ఏం జేసిందో, ఏదైనా తెచ్చి పడేసిందో లేదో చూద్దామన్న ఆదుర్దాతో ముందు గేటు దగ్గరకు వెళ్లాను.

గేటు దగ్గర ఉత్తరం ముక్క పెట్టినట్టే ఉంది. ఎవరో దాన్ని బొటనవ్రేలితో తాకినట్లు గుర్తు మాత్రం ఒకటి కనిపిస్త ఉంది. ఆ తెల్లకాయితంపైన స్పష్టంగా రాత్రి అది అంటే ఆ దయ్యం గారు దాన్ని ముట్టుకొని ఉంటారు చదవటానికి. నిజంగా ఆమె వచ్చిందన్నమాట!

వచ్చి???

ఏదో గాబరా పుట్టింది. ఇంటి ప్రక్కనున్న కాళీస్థలం దగ్గరకు వెళ్ళాను. అక్కడేమీ లేదు! రెండో ప్రక్కనున్న కాళీ స్థలంలోకి వెళ్ళాను. అక్కడా ఏమీ లేదు. ఇంటి ముందున్న స్థలాన్నంతా చూపులతో గాలించి చూశాను.

ఆహా, ఏమీ కనుపించలేదు!! నిరుత్సాహం నా హృదయంలోకి తొంగి చూచింది. నిలబడి పోయాను. నిలబడి ఆలోచించాను. ఇంతకూ ఆ దయ్యం రానట్టా, వచ్చి గేటు తలుపులో, తెల్లకాయితం మీద ఉన్న బొటనవ్రేలి ముద్ర సంగతి ఏమిటి? కాబట్టి వచ్చే ఉంటుంది. వస్తే ఏమీ తీసుకురానట్టేనా అని అనుకుంటూ ఉండంగానే ఇంకా దొడ్లోకి వెళ్ళి చూడలేదన్న సంగతి చప్పున జ్ఞాపకానికి వచ్చింది. అక్కడికి వెంటనే పరుగెత్తాను. ఏమీ ఉండదు అనే నమ్మకంతోనే.

అరె! నిజంగా విచిత్రం!!

దొడ్లో, మధ్యగా ఇటుకరాళ్ళ కుప్ప!!

నా కళ్ళు నేను నమ్మలేకపోయినాను. భయము, భ్రాంతి, విభ్రమము, విస్మయము. ఇవన్నీ కలిసి ఒక్కటై, నా శరీరంలో సుళ్ళు తిరిగినై. ఆశ్చర్యచకితుణ్ని అయి ఆపాదమస్తకం ఆకంపించి నిశ్చేష్టకాష్ఠాకృతి దాల్చాను.

4

దయ్యాలు నిజంగా ఉన్నాయన్నమాట! అందులో కొన్ని ఈ రకంగా ఉపకారం చేస్తయ్యన్న విషయం కూడా నిర్ధారణ అయిపోయింది.

ఇంతకూ భగవంతుడికి నాయందు కృప గలిగింది. మా పానకాలరాయుడికి నాయందు దయ వచ్చింది. మా నరసింహ మూర్తికి, "రెండవ సాటి దైవమిక లేదనుచున్, గడ కట్టి భేరికా దాండ దదాండ దాండ, నినదంబులు, అజాంజడము నిండ మత్తవేదండము నెక్కి చాటెదను" – అని మనస్సులో అనుకొని పొంగిపోయాను.

మళ్ళీ ఒకసారి ఇటుక కుప్ప వంక చూశాను.

అరుణ కాంతిలో, అవి ఎర్రగా మెరిసిపోతున్నవి. వాటిని ముట్టుకుని చూశాను అవి నిజమైన రాళ్ళా లేకపోతే ఏమైన మాయరాళ్ళా అని, అవి నిజమైన ఇటుకరాళ్ళు. అందులో ఏమీ మాయ లేదు.

ఇహ ఎందుకూ ఊరికే సందేహాలు పెట్టుకోవటం. నాకు మంచి రోజులు వచ్చినై. బాగుపడే గీత బైటపడ్డది. అంతే.

లోపలికి పోయి పానకాలరాయుడి పటానికి ఎదురుగా నుంచుని "ప్రభూ కృతజ్ఞుడ్ని. నీ పాదారవిందములను నిరంతరమూ పూజించే ఈ భక్తుడ్ని కరుణించు. శూన్యంలో నుంచి ఘన పదార్థాన్ని సృష్టించే శక్తి ఈ దయ్యానికి ఇచ్చావు! బంగారాన్ని సృష్టించే శక్తి కూడా ఇస్తివా ఇక నాకు కోర తగింది ఏదీ వుండదు. ప్రభూ దయ చూపు – అని ప్రార్థన చేశాను.

ఇక నాకేమీ తోచలేదు. ఇల్లు తాళం వేసి ఊళ్ళోకి వెళ్ళాను. ఇంట్లో ఉంటానికి ఏదో భయం కూడా వేసింది.

ఇప్పుడు కర్తవ్యం ఏమిటో అని తీవ్రంగా ఆలోచించాను. ఈ దయ్యం బంగారం తెచ్చి యిస్తుందా యిక ముందైనా! ఇవ్వదని తోచింది. ఇచ్చేదైతే ఇవ్వాళే ఇచ్చేది. ఇది ఇటుకలు చేసే దయ్యం అయి ఉంటుంది. దీన్ని యింకొకటి అడగటం బాగుండదు. అడిగినా యియ్యదు.

పచారు దుకాణాలలో పండ్లు అమ్మరు. పండ్ల దుకాణంలో ఇంగువ అడిగినా

దొరకదు. ఎవడి సరుకు వాడు ఇస్తాడు. కాబట్టి ఈ దయ్యాన్ని ఇంకో వస్తువు అడగటం తెలివితక్కువతప్ప మరోటి కాదు అన్న నిశ్చయానికి వచ్చాను.

ఇటుక మటుకు ఇల్లాగ రోజుకు నాలుగు వందలు ఇస్తుంటే చాలదూ? కొద్ది రోజులలో లక్షలు లక్షలు అవుతుంది. మనకు కావలసింది ఉంచుకొని మిగిలింది అమ్మి, సున్నం, కలపా అవీ కొనుక్కొని మేడ ఒకటి వేయవచ్చు. ఇల్లాగ అనుకొంటూ వీధిలో ఉన్న మేడల వంక చూస్తూ నడిచి వెళ్ళాను.

ఇల్లాగ అమ్మితే ఎంత కాలంలో ఎంత సొమ్ము వస్తుందీ అని గానీ, ఎంత కాలంలో లక్షాధికారి అవుతాను అని గానీ, నేను లెక్క వేయలేదు. అల్లాంటి ఊహలే రానియ్యలేదు.

అల్లాగ చేయటం చాలా తెలివితక్కువా అనవసరమునూ!! గాలి మేడలు కట్టటం నా తత్వం గాదు. నెమ్మదిగా, తాపీగా కూర్చుని ఆలోచించటమే నా స్వభావం.

ఆ వెళ్ళటం నేను హొటలుకే వెళ్ళి భోజనం చేసి సరిగ్గా ఇంటికే వచ్చేశాను. జరిగిన విషయం అంతా తల్చుకొంటే చాలా తమాషాగా ఉంది. వళ్ళు ఝల్లుమంటున్నది.

ఒక్క విషయం ఏమిటంటే హఠాత్తుగా వచ్చిన ఈ సంపద నన్నేమీ తలక్రిందు చేయలేదు. లాటరీలో లక్ష రూపాయలు వచ్చినైయని విని వెంటనే వెనక్కు విరుచుకుపడిపోయిన వాడిలాగు ప్రవర్తించలేదు. కొంత మందికి పిచ్చెత్తటం కూడా కద్దు. నాకు అల్లాంటిదేమీ జరగలేదు. మనఃస్థయిర్యం నిలబెట్టుకోగలిగాను.

చివరకు ఎన్ని రోజుల్లో ఎంత ఇటుక మన అధీనంలోకి వస్తుంది అన్న ఆలోచనలోకి అయినా దిగలేదు. ఎందుకూ? రేపు ఏమౌతుందో! రేపు అది ఇటుక తెస్తుందో తేదో!

ఇల్లా అనుకుంటూ ఉండంగానే మరో ఆలోచన వచ్చింది. దయ్యాలు తెచ్చే వస్తువులు నిజమైనవి కావనీ నిజమైన వానిలాగే కనపడి చప్పున మాయమౌతాయని ఈ ఆలోచన రావటంతోనే నేను దొడ్లోకి పరుగెత్తుకొని వెళ్ళాను. ఆ ఇటుకలు ఏమైనా మాయమైపోయాయేమో చూద్దామని. లేదు ఆ ఇటుకలు కుప్పగా అక్కడే ఉన్నవి. మధ్యాహ్నపు టెండలో అవి మెరుస్తూ అల్లాగే ఉన్నయి.

ఇది చాలా తమాషా అయిన విషయము మటుకు అవును. మనకు ఏ విషయమువల్లనైనా సంతోషం గలిగినప్పుడు దాన్ని గురించి స్నేహితులతో చెప్పితే, వాళ్ళు మనలను వీపు చరిచి "అదృష్టవంతుడివిపో!" అనటం వల్ల కొంత తృప్తి ఆనందం కలుగుతుంది. మనకు కలిగిన సంతోషాన్ని ఇతరులకు కాస్త పంచి ఇయ్యకపోతే మనకేదో బాధగా కూడా ఉంటుంది. ఈ విచిత్రానుభవాన్ని గూర్చి ఎవరితోనైనా చెప్పాలని అనిపించింది. కాని దాని వలన కొత్త చిక్కులు వస్తయి అని తోచి నా సంతోషాన్ని నా కడుపులోనే పెట్టుకొని ఊరుకొన్నాను. ఒకటి రెండు మూడు రోజులు గడిచినై. ఆ దయ్యం రోజుకు నాలుగు వందలని లెక్క ప్రకారం తేవటం లేదు. రెండో రోజున సుమారు రెండు మూడు వేల ఇటుకలు పడేసింది!! మూడో రోజున పది వేలు దాకా పడేసింది! ఇల్లాగ రోజు రోజు ఎక్కువ చేస్తున్నట్లు కనిపించింది. దొడ్డి నిండిపోయింది. ఇహ అట్టే చోటు లేదు.

5

ఇప్పుడో కొత్త సమస్య వచ్చి పడ్డది. ఉన్న ఇటికలను ఏదో విధంగా ఉపయోగపరచాలె. లేకపోతే, ఇక వచ్చే సరుకుకు చోటు లేదు. ఈ ఇటుకను అమ్మన్నా అమ్మాలె. లేకపోతే మరో విధంగానైనా వినియోగించాలె.

అప్పటికి మా ఆవిడ వెళ్ళి అయిదు రోజులైంది. ఇక అయిదారు రోజులలో వచ్చేస్తుంది. ఆవిడ వచ్చేసరికి దొడ్లో ఒక ఔట్‌హౌస్ కట్టించి ఉంచితే! భలే ఆశ్చర్యపోతుంది! చాలా మెచ్చుకుంటుంది.

ఇదివరలో నేను డబ్బు సరిగా వాడటం లేదనీ, దుబారాగా ఖర్చు చేస్తున్నాననీ, గునుస్తూ ఉండేది. ఇల్లాగ చేస్తే ఆనందిస్తుంది. ఇదంతా నా స్వంత డబ్బు పెట్టి కట్టించాననే చెప్పేస్తాను! నాయందు ఆమెకు చాలా మంచి అభిప్రాయం కలగడమే కాకుండా, నేను ఏదో రహస్యంగా డబ్బు నిలువజేస్తున్నానని కూడా అనుకోవచ్చు. అల్లా అనుకోవటమే మంచిది.

అయితే రోజూ ఇల్లాగ ఇటుక వచ్చి పడటం జూచి ఇదేమిటని అడగదా, అప్పుడన్నా తెలియదా ఇది నా స్వంత ప్రయోజకత్వం కాదనీ, అని తోచింది. కాని దానికో ఎత్తు ఎత్తి ఉంచాను.

ఇటుక వ్యాపారం చేస్తున్నానూ అని ఆవిడతో చెబుదామని.

పాపం ఆవిడకు మెడలోకి ఓ గొలుసు మటుకు తప్పకుండా కొని యియ్యాలె. ఎన్నాళ్ళబట్టో అడుగుతున్నది.

ఈ ఇటిక ఔట్‌హౌస్ కట్టటానికి వినియోగించినా మళ్ళీ నాలుగు రోజులలో పది పన్నెండు వేల ఇటుకలు తయారు అవుతుంది. వెయ్యి ఇరవై రూపాయలకే ఇచ్చినా ఓ రెండు వందల ఏభై రూపాయలు సులువుగా వస్తయి. వస్తుంది నవరసుల గొలుసు! ప్రస్తుతం అది చాలు. అంతగా అయితే ఇంకో నాలుగు నెలలు పోయిన తరువాత పసిదాని మాట ఆలోచించవచ్చు. ఇల్లాగే అనుకొన్నాను.

ఇంతకూ ఆ వున్న ఇటికతో వెనకను ఓ ఇల్లు వేద్దామనే నిశ్చయించాను. మూడు గదులుగా ఉండాలనుకొన్నాను. చదువుకొనేందుకు ప్రత్యేకంగా మాకు ఒక్కొక్కరికి ఒక్కొక్క గది కావాలని మొగ పిల్లలు చాలా రోజుల నుంచి గోల పెడుతున్నారు. వాళ్ళు హాలులోనూ వంటింట్లోనూ కూర్చుని చదువుకొంటున్నారు పాపం! ఒక్కొక్కడికి ఒక్కొక్క గది ఇద్దామని నాకూ సరదా గలిగింది. ఎవరి గదిలో వాడు తన పుస్తకాలూ, బట్టలూ, పెట్టెలూ, పెట్టుకొని హాయిగా చదువుకొంటాడు, మిగిలిన గది ముగ్గురు ఆడపిల్లలకూ ఉమ్మడిగా ఉంటుంది. భగవంతుడి దయ ఉంటే వాళ్ళకు కూడా మూడు గదులు కట్టించాలనే ఉంది. అది ఇప్పటి మాట గాదు.

ఈ దొడ్లో ఇల్లు వేసే విషయంలో మన దగ్గర ఇటుక మాత్రం ఉన్నది కాని సున్నమూ, కలపా, వెంటనే కొనాలె. మేస్త్రీలకూ, కూలీలకు ఇయ్యటానికి కొంత డబ్బు చేతిలోను ఉండాలె. సున్నం అయిదారు బండ్లు అప్పుమీద తేగలనూ, పరవాలేదూ అనుకొన్నాను. కలపమటుకు క్యాష్ ఇచ్చి కొనాలె. మిగతా వాటికి దాని తరువాత చూచుకోవచ్చు.

కలప కొంటానికి మటుకు క్యాష్ ఎల్లాగా అని ఆలోచించాను. ఆ ఆలోచన ఎంతో సేపు పట్టలేదు. బ్యాంకిలో అప్పు తీసుకొందామని వెంటనే నిశ్చయం చేశాను. తరువాత నాలుగు రోజులలో ఇటుక అమ్మి ఎట్లాగూ అప్పు తీర్చి పారేస్తాను. కాబట్టి అప్పు చేయటం వల్ల వచ్చిన పెద్ద ఇబ్బంది ఏమీ లేదు అని కూడా తోచింది.

మా ఆవిడ వచ్చే లోపల ఇల్లు తయారై పోవాలనీ, ఆవిడ వచ్చి చూచి ఆశ్చర్యపడి "అరె! ఎప్పుడు కట్టించారండీ? ఎంత అందంగా ఉందండీ? డబ్బు ఎక్కడదండీ అప్పు జేయలేదుగద?" అని అంటూ ఉంటే "అప్పు లేదూ ఏమీ లేదు. ఏదో డబ్బు క్యాష్ రూపంగా ఉంచుకోవటం మంచిది గాదు. ఈ యుద్ధపు రోజుల్లో, అని కొంతమంది స్నేహితులు అంటే, సరే, ఎందుకు వచ్చిన గోల అని ఇల్లాగ చేసేశాను" – అని దర్జాగా తమాషాగా నిర్లక్ష్యంగా నేను అందామనీ, నిశ్చయించుకొన్నాను.

"ఇన్నాళ్ళబట్టి చెప్పారుకారేమండీ! నిలువజేశారన్న మాట! డబ్బు లేదూ అంటూ ఉంటే తెలివితక్కువ దాన్ని మీరు పాడుచేస్తున్నారనుకొన్నాను! అమ్మ ఎంత దొంగండి మీరు! పోనీలెండి మంచి పని చేశారు. పిల్లలకు కాస్త ఆస్తి ఏర్పడుతుంది" అని ఆవిడ తప్పకుండా అంటుంది.

కాబట్టి ఇల్లు తత్క్షణం తయారు చేసి ఇల్లాంటి సరదా మాటలు విందామనుకొన్నాను. మన వూళ్ళో అడితీలో కొనేకంటే గుడ్లవల్లేరు రేవులో కొంటే , కఱ్ఱ చాలా చౌక? అంతేకాక మంచిది కూడా దొరుకుతుంది. అందుకని డబ్బు జేబులో వేసుకొని గుడ్లవల్లేరుకు కారు ఎక్కాను.

గుడ్లవల్లేరులో నేను అట్టే సేపు ఉండలేదు. గిల్లి బేరం చేయటం నా స్వభావమూ కాదు. మంచి టేకు కఱ్ఱ కావలసింది బేరం చేసి, ఇంటికి పంపమని చెప్పి, యాభై రూపాయలు అడ్వాన్సు ఇచ్చి మిగతా యాభై ఇంటి దగ్గర ఇస్తానని చెప్పి వచ్చేశాను.

నేను ఊళ్లోకి రావటం ఏడు గంటలకే వచ్చినా, కాఫీ హెూటలులోనూ , అక్కడా కాసేపు గడిపి భోజనం చేసి రాత్రి ఎనిమిది గంటల ప్రాంతాన ఇంటి దారి పట్టాను. ప్రొద్దున వెళ్ళటం అదే రావటం.

6

నేను మా యింటికి ఓ ఫర్లాంగు దూరంలో ఉండంగానే మా ఇంట్లో ఓ దీపం వెలుగు కనిపించింది. ఏమీటా అని చూశాను. కిటికీలోంచి స్పష్టంగా దీపపు వెలుగు కనిపిస్తున్నది. దీని దుంపతెగ ఆ దయ్యం ఇంట్లో ప్రవేశించి ఇల్లంతా చూస్తున్నదిరా అనిపించింది. గుండె బద్దలైపోయింది. మెల్లగా నడిచివెళ్లాను. ఇంటి ముందు ఒక నిమిషం నిలబడి చూశాను. ఇంట్లో ఎవరో మెదులుతున్నట్లు కూడా అలికిడి అయింది.

ఇంతలో చప్పున జ్ఞాపకం వచ్చింది మా ఆవిడ వచ్చి వుంటుందీ అని. నా తెలివితక్కువకు నవ్వుకొని గబగబా లోపలికి వెళ్లాను – "ఎప్పుడొచ్చావ్! ముందుగా ఉత్తరమైనా రాయలేదేం?" అంటూ. ప్రొద్దునే ఆరు గంటల బండికే వచ్చాము. అయ్యగారు ఇంట్లో లేరు. నా దగ్గర కూడా తాళం చెవి ఒకటి ఉండబట్టి సరిపోయింది కాని లేకపోతే ఇప్పటి దాకా చలిలో బయట ఉండాలిసి వచ్చేది! ఎక్కడికి వెళ్ళారూ అన్నది.

"నేను ఎక్కడికి వెళ్ళిందీని చెప్పటానికి ముందు నీకు చెప్పవలసిన సంగతులు చాలా ఉన్నవి. నీ భోజనం అయిందా? పిల్లలు అప్పుడే పడుకొని నిద్రపోతున్నారే?" అన్నాను.

ప్రయాణం బడలిక వల్ల నిద్ర వస్తుంటే అన్నం వండి పిల్లలకు పెట్టి ఆకలైతే నేనూ తినేశాను. మీ భోజనం మాట ఏమిటి?

"నేను భోజనం చేసి వచ్చాను. హోటల్లో" అన్నాను.

ఆ తరువాత ఒక అరగంటలో కాంతం ఇల్లంతా సద్దుకొని వచ్చి నా ప్రక్కనున్న మంచం పైని నడుము వాల్చి ఏమిటి సంగతులు చెప్పండీ – చాలా సంగతులు ఉన్నయి అన్నారూ అన్నది.

7

ఇప్పుడు నేను ఈ దయ్యం ఇటుకలు తేవటం సంగతి అంతా చెప్పెయ్యాలా వద్దా అని ఆలోచించాను. చెప్పేస్తే ఇల్లు కట్టటంలో స్వప్రయోజకత్వం ఏమీ లేకుండా పోతుంది. కాబట్టి ఆ విషయం దాచేసెయ్యాలె. అసలు నేను వేసుకొన్న ప్లాను సగం పాడైపోయింది. దొడ్లో క్రొత్త యిల్లు వేసి ఆమెకు చూపిద్దామనుకొన్నాను. కాని ఆమె నాలుగైదు రోజులు ముందుగా రావటం వల్ల నేను అనుకొన్నంత ఆశ్చర్యం ఆమెకు కలుగజేయలేకపోయినాను. ఇప్పుడు అసలు సంగతి చెప్పేస్తే వ్యవహారం బొత్తిగా చప్పబడిపోతుంది. ఆ రాత్రికి ఆ విషయము బైట పెట్టవద్దనే అనుకొన్నాను.

మర్నాడు కలప వస్తుంది. పని వాళ్ళను కూడా రమ్మని చెప్పి వచ్చాను. ఇదంతా చూచి ఆమె ఆశ్చర్యపడితే అప్పుడు చెప్పవచ్చు. అప్పుడైనా దయ్యం సాయం వల్ల ఇటుకలు వస్తున్నాయని చెప్పకూడదు. అల్లా చెపితినా సంతోషిస్తుంది గాని ఆవిడకు

నా మీద గౌరవం మాత్రం కలుగదు. అసలు ఆ సంగతి ఎత్తకూడదు. ఇటుక వ్యాపారం వల్ల అపారధనం గణిస్తున్నట్లు ఆమెకు అభిప్రాయం కలుగజేయాలె.

అందుకని ఆమెతో ఈ కథ ఏమీ చెప్పలేదు. అమ్మాయి పెండ్లికి వెయ్యినూట పదహార్లు కట్నం యిచ్చి మంచి సంబంధం తెస్తానన్నాను. ఆవిడకు నాలుగైదు రోజులలో ఓ జిగినీ గొలుసో, లేకపోతే ఒక అటుకుల గొలుసో, కొని ఇస్తానన్నానుగానీ, ఈ మాటలు విని సంతోషించటానికి బదులు మండిపడి "చాల్లే ఊరుకోండి. గొంతెమ్మ కోరికలూ మీరూనూ! అన్నీ కొనే వారిలాగే జిగినీ గొలుసుకావాలా అటుకుల గొలుసు కావాలా అనీ, రేడియోకొంటే బాగుంటుందా అని అడుగుతున్నారు! అయ్యో! అయ్యో! మీరు గొలుసు చేయించడమూనూ, నేపెట్టుకోడమూనూ! ఇంటికైన అప్పు అట్లాగే ఉంది. ఆవగింజలో అరవీసం తీరలేదు. రేడియో కొంటారట రేడియో!!" అని చీదరించింది, "నీకేం తెలుసు నా సంగతి కొనగల్గుదునో లేదో నీకే తెలుస్తుంది కొద్ది రోజుల్లో!" అని ఊరుకొన్నాను.

"నాకు తెలియనిది ఏముంది? డబ్బు ఎక్కడి నుంచి అయినా కొట్టుకురావాలె!" అన్నది ఆవిడ విసుగ్గా.

"కొట్టుకొస్తుంది చూస్తుండు" అన్నాను ధైర్యంగా. నా మాటలయందు ఆవిడ ఏ మాత్రం విశ్వాసం చూపలేదు. నాకు డబ్బు చేసే ఉపాయం దొరికిందని నేనూ చెప్పలేదు ఆవిడకు!!

మర్నాడు నేను నిద్రలేచేసరికి మా ఆవిడ ఎవరి మీదనో పెద్దగా కేకలు వేస్తున్నది. ఆ కేకల వల్ల నాకు మెళకువ వచ్చింది.

"మాకు కాదయ్యా. మాకెందుకూ ఈ దూలాలూ కడ్డీలూనూ! ఎవరివో!" అంటూన్నది మా కాంతం. అవతలవాడు "పంతులుగారు నిన్న కొన్నారండి" అంటూన్నాడు.

"మా పంతులుగారు కాదని చెపుతూ ఉంటే వినవేం! ఎవరివో కనుక్కో మాకు గాదు" అంటూన్నది ఆవిడ.

ఈ గోల విని నేను గబగబా వాకిట్లోకి పరుగెత్తికెళ్ళి "మనకేలేవే కాంతం ఊరుకో నేను కొన్నాను" అన్నాను.

"ఎందుకూ!" అన్నది ఆవిడ నన్ను వెర్రివాడిలా చూస్తూ.

"నీకు తెలియదులే ఊరుకో. దొడ్లో ఒక ఔట్‌హౌస్ వెయ్యాలనుకొన్నాను. ఇటుక తెప్పించాను. సున్నం పంపమని చెప్పి వచ్చాను. పని వాళ్ళు ఇంకా కాసేపటికల్లా వచ్చి పని ప్రారంభిస్తారు" అని సంగతులన్నీ చెప్పేశాను. వడగళ్ళలాగ పడిపోయినై విశేషాలన్నీ. ఆవిడ ఆశ్చర్యపోయింది. పోక ఏం జేస్తుంది హడలగొట్టేస్తిని ఒక్కసారి! ఆవిడ విచిత్రంగా చూస్తూ నిలబడి వుంది.

"రాత్రి అంటివే డబ్బు ఎక్కడి నుంచి అయినా కొట్టుకొస్తుందా అని ! యిప్పుడేమంటావ్! ఇటుక ఉంది. కలప కొనేశామ్. ఎల్లుండి కల్లా యిల్లు తయార్!!" ఈ మాటలు ఆమెకు ఆశ్చర్యం కలగటానికి ఏ పద్ధతిలో అనాలో ఆ పద్ధతిలో అన్నాను గర్వంగా.

ఆవిడ తెల్లపోయి చూస్తూ, ఏమిటీ! ఎంత పని జరిగిందండి! ఒక్క మాటైనా అనకపోతిరేం!!అని అడిగింది. యిటుక నీవు యింకా చూడనేలేదూ! రా చూపిస్తా, అంటూ ఆవిడను నెట్టుకుంటూ దొడ్లోకి తీసికెళ్ళాను.

అరె!!

ఒక్క ఇటుక ముక్కయినా లేదు అక్కడ. పైగా యిదేమిటి!! శాస్త్రిగారి యింటికీ, మా యింటికీ మధ్య గోడ ఒకటి లేచింది!

నాకు నోట మాట రాలేదు. నిర్ఘాంతపోయినాను ఎట్లా జరిగిందీ ఈ వింతా అని! ఆ దయ్యం పనా యిది? ఛా, ఎప్పటికీ కాదు.

అయితే ఎట్లా జరిగిందీ అని ప్రశ్న వచ్చింది కాని, ఎంతో సేపు ఆలోచించవలసిన అవసరము లేకపోయింది. ఛ... ఆ శాస్త్రి చేసిన పనే యిది! నేను యింట్లో లేకుండా చూచి ఈ పని చేసి ఉంటాడు.

నిన్న సాయంత్రానికి యిది తయారై ఉంటుంది. వీడి దుంపతెగ ఎంత దౌర్జన్యం చేశాడూ! ఇటుకంతా కాజేశాడే!! అని ఆలోచిస్తూ నుంచున్నాను. ఆవిడను లాక్కొచ్చిన విషయమే మరిచిపోయినాను.

ఏమిటండీ అలా చూస్తారూ? ఎందుకూ ఆ గాబరా? అని ఆవిడ అడుగుతూ

ఉన్నా నేను వినిపించుకోలేదు.

ఈవిడ ప్రొద్దునే వచ్చింది కదా, యింత పని జరుగుతూ ఉంటే తెలీకుండా ఉందా? పని వాళ్ళు వచ్చి హడావుడిగా గోడ కడుతూ ఉంటే ఈవిడకు తెలీకుండా ఎల్లాగ ఉంటుంది? తెలిసే ఉంటుంది. తెలిసినప్పుడు ఆవిడ చూస్తూ ఊరుకోకపోతే అదేమిటండీ అనకూడదూ?

అంత ఇటుకా ఆయన పబ్లిక్కుగా కాజేస్తుంటే ఈమెగారు ఊరుకోటం ఏమిటి! యిల్లాగ అనుకొని మొత్తం మీద తప్పు అంతా ఆవిడదే అయినట్లు తేల్చుకొన్నాను. ఈ నిశ్చయానికి వచ్చేసరికి ఒక్క నిమిషం పట్టింది. యింతలో మా కాంతం నా దగ్గరకొచ్చి మీద చెయ్యి వేసి ఏమిటి అల్లాగ చూస్తున్నారూ? అని అడిగింది! నాకు వళ్ళు మండిపోయింది. ఆవిడ యిల్లాగ ఏమీ తెలియని నంగనాచిలా అడగడం చూస్తే!

"యహ్ ఉండు మహ తెలియని దానిలాగ అడుగుతావు?" అని అంటూ ఆవిడ చెయ్యి విదిలించి వేశాను.

"ఏమిటండీ తెలియటం?"

ప్రొద్దున ఇక్కడ ఇటిక ఉందా?"

"ఆ"

"అదంతా ఏమైంది?"

"ఏమైందో కనపడటం లేదండీ గోడ కట్టించాడాయన?"

"గోడ కట్టిస్తూ ఉంటే నీవు చూస్తూ కూర్చున్నావు కాబోలు?

"చూడక ఏం జేయమంటారండీ?"

"ఆ మాత్రం తెలియదూ? ఇంట్లో నేను లేకుండా జూచి ఇటిక అంతా ఆయన కాజేస్తుంటే నోరు తెరుచుకు చూస్తున్నావూ, ఇంటికైనదానివి? వద్దని అనటం తెలియదేం?"

"అదేమిటండీ అల్లా అంటారు ఆయన సొమ్ము ఆయన వాడుకొంటూ ఉంటే నేను వద్దు అనటం ఏం బాగుంటుందండీ"

"ఆయన సొమ్మా? ఇటుక అంతా తనదే అన్నాడు కామాలు! నీవు నమ్మావు!

తెలివితక్కువ దద్దమ్మవు! ఆయన అంటేమటుకు ఒక వేళ మనదేమో, యింటాయన తెప్పించారేమోనని అనుకోవద్దూ?"

"అయ్యో కర్మమా అదేమిటండీ అల్లా కోప్పడతారూ? వాళ్ళు మన దొడ్లో ఇటుక వేసుకొంటామని నాకు ముందుగానే చెప్పారు! నేను వెళ్లే రోజునే జానికమ్మగారు నన్ను అడిగింది. మా ఇటుక బండ్లు వస్తయ్యమ్మా, మా దొడ్డి బొత్తిగా చిన్నది. స్థలం లేదు. మీ దొడ్లో వేస్తామని. పోనీ ఏం భాగ్యం వేసుకోండి అన్నాను. ఇవాళ ప్రొద్దునే శాస్త్రిగారు పని వాళ్ళను పిలిపించి గోడ పూర్తి చేయించాడు. కొద్దిగా మిగిలిన ఇటుక వాండ్ల దొడ్లో ఒక మూల వేసుకొన్నారు. ఆయనేమిటి? మీ ఇటుక కాజేయటం ఏమిటీ? నాకేం అర్థం కావడం లేదు!"

ఈ మాటలు వినేసరికి, ఆకాశం విరిగి మీద పడ్డట్లు అయింది. నా తల తిరిగి పోయింది. ఈ ఇటికంతా మా దొడ్లోకి ఇలాగ వచ్చిందని నా కేమి తెలుసూ!

ఆ శాస్త్రిగారు ఇటుక తోలించు కొంటున్నారు అని నాకు ముందుగా తెలిస్తే. ఇంత కథ జరగకుండా ఉండేది. ఇప్పుడెట్లా కలప వచ్చి కూర్చున్నదాయె! పని వాళ్ళూ వస్తూ ఉంటారు బహుశ! సున్నం కూడా పంపమని చెప్పితిని!! అంచేత చాలా కోపం వచ్చింది. కాని ఎవరి మీద కోప్పడాలో తెలియలేదు.

చివరకు "ఈ సంగతి నాతో చెప్పలేదేం?" అని మా ఆవిడ మీదే ఎగిరిపడ్డాను. ఆవిడ అన్నది . "ఏమంత మహాభాగ్యమని చెప్పాలె! మరిచిపోయినాను. అదీగాక ఆ రోజే వెళ్ళిపోతిని!" ఈ మాటలు అని ఆవిడ బిక్కముఖంతో అక్కడే నిలబడ్డది.

నేను ఆవిడను అక్కడ వదిలేసి వాకిట్లోకి వెళ్ళాను. ఆ కలప ఏం జెయ్యాలన్న సమస్య ఒకటి వచ్చింది. "ఈ కలప ఎందుకు కొన్నారూ? ఇటుక మీరు కొంటే ఆయన కాజేయటమేమిటీ! ఏమిటో సంగతి చెప్పండీ?" అని మా ఆవిడ గొడవ. బండివాడు బాడిగ యిమ్మని గొడవ. తల తిరిగి పోతుంది. పిచ్చి ఎక్కుతున్నది.

ఇంతలో నేను గేటుకుకట్టిన ఉత్తరం క్రింద పడి ఉంటే దాన్ని మా కాంతం తీసి చూచి, "ఇదేమిటండోయ్? నేను యింత సేపటి నుండి చూడనేలేదు! ఎవరికి వ్రాసిన ఉత్తరం ఇది?" అని ఉరిమిచూస్తూ అడిగింది.

నేను ఏం జెప్పేది? అసలే మనస్సు నానా ఖంగాళీగా ఉందాయె. "దానికీ" అన్నాను.

దేనికి? దేనికండీ ఈ ఉత్తరం? మీరు వచ్చిన దాకా కుర్చీలో కూర్చోమని రాశారు కూడా! అని నిలవ తీసి అడిగింది నన్ను అనుమానిస్తూ.

8

వ్యవహారం అంతా వెధవ గొడవ క్రింద తేలిపోయింది. వళ్ళు అంతా చీదర పుట్టింది. చీకాకేసింది. కోపం వచ్చింది. ఇప్పుడావిడకు ఈ ఇటుక సంగతి ఏమని చెప్పేది? నేనే తెప్పించాను. ఆయన కాజేశాడు అని నిలబడితే పెద్ద పోట్లాటా, సాక్ష్యాలూ వస్తయి. అసలు నిజానికి ఇటికేమో ఆయన తోలించుకుంటే, అది నాది అని నేననుకొంటిని ఈ దయ్యపు గొడవలో పడి !! ఈ ఉత్తరం ఎవరికి వ్రాశానని చెప్పేది. ఈ ఛండాలపు చిక్కుల్లో పడి తల గోక్కుంటూ నుంచున్నాను.

"ఏమండీ ఏమిటీ గొడవ అంతాసూ? ఇటుక ఆయనదే అని నేను అనుకొన్నాను. వాళ్ళు ముందుగా నాతో చెప్పారు కాబట్టి! మనదా ఏమిటండీ? మనదయితే ఆయన అంత ధైర్యంగా అన్ని వేల ఇటుకలు ఎల్లా కాజేస్తాడండీ? మీరు ఎవరికి డబ్బు ఇచ్చారూ మనకీ ఇటిక తోలమనీ? భద్రయ్యకేనా! ఏ మాత్రం యిచ్చారూ? ఓ పాతికైనా యిచ్చి ఉంటారు! పాతికేం, యాభై యిచ్చి ఉంటారు! అంతేనా?" అని ఊరికే ఆవిడ అడుగుతూ ఉంటే నేను ఏమీ మాట్లాడలేదు. పట్టుబడ్డ దొంగలాగ నుంచుని ఊరుకొన్నాను. ఆవిడకు మరీ అనుమానం కలిగింది.

మళ్ళీ యిల్లాగ అన్నది ఆవిడ.

"సరే, యింకెందుకూ. తెలిసింది. భద్రయ్యకేమో యాభై రూపాయలు యిస్తే వాడు కాజేసి ఊరుకొన్నాడు మీరేమో యిదంతా భద్రయ్య తోలిన ఇటుకే అనుకున్నారు. అంతే గదండీ ఏ మాత్రం తగలేశారు చెప్పరేం?

నేను మాట్లాడక ఊరుకొన్నాను. నేను ఊరుకొంటే ఆవిడ ఊరుకొందా? లేదు. ఈ వుత్తరం ఎవరికండీ వ్రాసిందీ?

మహాశయా అని వ్రాశారు. ఎవరు ఈ మహాశయ? ఏమిపనండీ యిది నేను

ఊళ్లో లేకుండా జూచి!! అని అడుగుతుంటే గుండెల్లో గుద్దినట్లు అయింది.

ఇహ ఎందుకొచ్చిన గోల అని, దయ్యపు సంగతి అంతా, ఆ స్థితిలో చెప్పగలిగినంత ఓపికగా, టూకీగా చెప్పాను.

చెపితే ఏం లాభం? "నేనంత తెలివి తక్కువ దద్దమ్మను కానండోయ్! దయ్యానికి ఎవరైనా ఉత్తరం వ్రాస్తారా? ఎక్కడైనా విన్నామా యిల్లాంటి సంగతి! యిహ ఊరుకోండి" అని గట్టిగా అని, ఆ ఉత్తరం అక్కడ విసిరిపారేసి చురచురా చూస్తూ వెళ్ళిపోయింది. నేను ఆ ఉత్తరాన్ని చేత్తో పట్టుకొని ఆ కొత్తగా గట్టిన గోడవంక చూస్తూ దిగాలపడి నిలబడి పోయాను.

(1944)